# కర్నూలు । నంద్యాల
# వార్త

10 అక్టోబర్ 2025 | శుక్రవారం | పేజీలు 4


## ప్రజలు ఛీ కొట్టినా.. వైసీపీ నాయకులు మారడం లేదు..!



రాష్ట్ర మంత్రి టి.జి భరత్..అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన కూటమి నేతలుకర్నూల్ హాస్పిటల్ అక్టోబర్ 9 ప్రభాతవార్తరాష్ట్ర ప్రజలు ఛీకొట్టినా వైసీపీ నేతలు మారడం లేదని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. నగరంలోని పాత బస్టాండులోని అంబేద్కర్ విగ్రహానికి కూటమి నేతలు పాలాభిషేకం చేశారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహాన్ని వైసీపీ నేతలు ధ్వంసం చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ అందరికీ స్ఫూర్తి అన్నారు. రాష్ట్రంలో వైసీపీ నేతలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తున్నారన్నారు. అంబేద్కర్ విగ్రహంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే తప్పుచేయడానికి కూడా ఆలోచించే పరిస్థితి వస్తుందన్నారు. ప్రజలు వైసీపీ నేతల ఆగడాలన్నీ గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి.. ఓర్వలేని వైసిపి..!

**కర్నూల్ హాస్పిటల్ అక్టోబర్ 9 ప్రభాతవార్తా :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని వై.యస్.ఆర్.సి.పి. వారు తాడేపల్లి ప్యాలెస్ లో పూరిపాకలో మంట ద్వారా తన కడుపు మంటను చల్లార్చుకునే స్క్రిప్ట్ మలిచిందనీ, ఇందులో భాగంగానే చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలం, దేవలంపేటలో అంభేద్కర్ విగ్రహాన్ని అపవిత్రం చేస్తూ, ధ్వంసం చేసి నిప్పట్టించారనీ తెలుగుదేశంపార్టీ నాయకులు పార్లమెంట్ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, కోడుమూరు యం.యల్.ఎ. బొగ్గుల దస్తగిరి గార్లు తెలిపారు. సంఘటనను నిరసిస్తూ పార్లమెంట్ యస్.సి సెల్ అధ్యక్షులు దరూరు జేమ్స్, రాష్ట్ర యస్.సి.సెల్ ఉపాధ్యక్షులు ముత్యాల తిరుపాల్, పోతురాజు రవికుమార్, రెడ్డిపోగు బజారన్న, గున్నా మార్క్, పేరపోగు రాజు, టి.ఎన్.టి.యు.సి నర్సింహులు, సుంకన్న, సత్రం రామక్రిష్ణ, యల్.వి. ప్రసాద్ మొదలగు వరితో పాటు కార్యకర్తలతో కలిసి ఈ రోజు కర్నూలు నగరంలోని పాతబస్టాండ్ దగ్గర ఉన్నటువంటి డా,, బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధిచేసి, క్షీరాభిషేకం చేశారు.




## జొన్న(స్వర్ణ)..గిరి..!



- బంగారు ఉత్పత్తికి సిద్ధం
- రాయలసీమ రతనాలసీమనే కాదు బంగారు సీమ
- రాయలేలిన సీమలో రతనాలు రాశులుగా పోసి అమ్మేవారు
- నేడు రాయల సీమలో బంగారు సైతం రాశులుగా పోసి అమ్మే రోజులొచ్చాయి
- ఏడాదికి సుమారు 750 కిలో గ్రాముల బంగారం ఉత్పత్తి
- డిజీఎంఎల్ ఏకైక బంగారు అన్వేషణ సంస్థ
- జిల్లాలో త్వరలోనే ప్రారంభం.. : ఎండీ ప్రభాకరన్



**శ్రీకృష్ణ దేవరాయలు మహానుభావుడు, రాయలసీమని రతనాలసీమ అని ఏ సందర్భంలో ఎందుకు వాడారో తెలీదుగాని, నిజంగా రాయలసీమ రతనాలసీమనే కాదు బంగారు సీమ గా కూడా పిలవబడుతుంది తొలకరి జల్లులతో పుడమితల్లి పులకించగానే రాయలసీమలో వజ్రాల కోసం అన్వేషణ మొదలవుతుంది. దుమ్ముకొట్టుకుపోయిన వజ్రాలు తొలకరి చినుకులతో తడిసి సూర్యుని వెలుతురుకు తళుకుతళుకుమంటూ మెరిసే క్షణం కోసం ఔత్సాహికులు ఎదురుచూస్తుంటారు. రాష్ట్రంలోని సుదూర ప్రాంతాల నుంచి ఔత్సాహికులు వజ్రాల వెతుకులాట కోసం కర్నూలు జిల్లాకు తరలివస్తుంటారు. కర్నూలు, అనంతపురం జిల్లాల సరిహద్దులోని పంటపొలాల్లో వజ్రాలు లభించడం సర్వసాధారణంగా మారింది. ప్రతి ఏట తొలకరి జల్లులు పడగానే జనం వేయి కళ్లు చేసుకుని పొలాల వెంట వజ్రాల కోసం వెతుకుతుంటారు..**

కర్నూలు అక్టోబర్ 09, ప్రభాతవార్త ప్రతినిధి :

సాధారణంగా వర్షం పడితే జనం పొలాలపై పడి వేరుశనగో లేదా మరో పంట సాగు చేయడానికి దుక్కులు చేస్తారు. కానీ అక్కడ వర్షం పడిందంటే చాలు గ్రామాలకు గ్రామాలు పిల్లాల జెల్లా అంతా చద్ది కట్టుకొని వెళ్ళి చేలపై వెతుకులాట ప్రారంభిస్తారు. ఎందుకో తెలుసా.. వజ్రాలు.. వజ్రాల కోసం వేట ప్రారంభం అవుతుంది. ఇది ప్రతీ యేడు జరిగే తంతే.. ఎక్కడో తెలుసా... ఒకప్పటి రతనాలసీమ రాయలసీమలో... ఏటా వర్షాకాల ప్రారంభంలో ఇక్కడ పదుల సంఖ్యలో వజ్రాలు లభ్యమైతాయని అంచనా. కర్నూలు జిల్లా ఆదోని డివిజన్లోని జొన్నగిరి, ఎర్రగుడి, పెరవలి, గిరిగెట్ల, తుగ్గలి, మద్దికెర, అగ్రహారం, పగిడిరాయి,, రాతన కొత్తూరు, బసినేపల్లి,గిరిగెట్ల, అమినాబాదు, రాతన గ్రామాలు వజ్రాల కారణంగా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఆ గ్రామాల భూముల్లో ఏటా వర్షాకాలంలో వజ్రాలు దొరుకుతూనే ఉన్నాయి. అదృష్టం కొద్దీ ఎవరికైనా విలువైన వజ్రం దొరికిందంటే చాలు కరువు ప్రాంతంలో ఆ ఇంటి దశ తిరిగినట్లే. భారత దేశంలో బంగారు గనులు ఉన్నాయని, అవి ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయని మాత్రమే ఇప్పటి వరకు చదువుకున్నాం. ఇప్పటి నుంచి చరిత్ర మారబోతుంది. దేశంలో మొట్ట మొదటిసారి బంగారు గనులను ప్రైవేటు వ్యక్తులు చేజిక్కించుకోబోతున్నారు. ఇక్కడ విశేషం ఏమిటంటే అది మరెక్కడో కాదు..


• వివరాలు 2లో




## పరిశుభ్రత పాటించండి కలెక్టర్ సిరి

: అన్న క్యాంటీన్‌పై ఆకస్మిక తనిఖీ



**కర్నూలు, అక్టోబర్ 09, ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి గురువారం రాత్రి కలెక్టర్ కార్యాలయ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనం చేస్తున్న ప్రజలతో మాట్లాడుతూ భోజనం రుచి, నాణ్యత, పరి శుభ్రతపై వివరాలు తెలుసుకున్నారు. భోజనం బాగుందని, రుచిగా ఉందని వారు కలెక్టర్‌కి తెలిపారు. అనంతరం కలెక్టర్ వండిన పదార్థాలను పరిశీలించి, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. భోజనం నాణ్యతగా, రుచిగా ఉండేలా చూసుకోవాలని, పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని, నిర్ణీత సమయాలకు క్యాంటీన్ తెరవాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు.



## రోడ్డు ప్రమాదంలో.. తండ్రి కొడుకు మృతి

**ఆస్పరి, అక్టోబరు 9, ప్రభాతవార్త:** తన కుమారుడుని ఉన్నతంగా చదివించాలని ఎంతో సంతోషంగా ఆలూరు మండలం ఆరికేర గ్రామంలోని గురుకుల పాఠశాలకు తీసుకెళుతుండగా గురువారం మధ్యాహ్నం బిల్లేకల్లు గ్రామం వద్ద లారీ రూపంలో తండ్రీ కొడుకులను మృత్యువు కబలించింధి. మృత్యువులో కూడా తండ్రి కుమారుల పేగు భంధం వీడలేదు. ఈ హృదయవిధార సంఘటన పలువురి హహృదయాలను కదిలింపజేశాయి. దసర సెలవులు ముగించుకొని పాఠశాలకు వస్తూ బాలుడడు మాల దాసరి శ్రీనువాసులు(14) అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి మాల దాసరి మహేష్(45)కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందిన సంఘటన మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిల్లేకల్లు కూరగాయల మార్కెట్ సమీపాన బళ్ళారి కర్నూలు ప్రధాన రహదారిలో క్రిష్ణగిరి మండలం పోతుగల్ గ్రామానికి చెందిన మాలదాసరి మహేష్,మాలదాసరి శ్రీనువాసులు ధ్విచక్ర వాహానంపై ఆలూరు మండలంలోని అరికేర గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో చదువుతున్నాడు.ఇద్దరు మోటర్ బైక్పఇ వస్తుండగా బళ్ళారి నుండి కర్నూలుకు వెళుతున్న లారీ అతివేగంగా వచ్చి స్కూటర్ మీద నుండి దూసుకెళ్ళడంతో ఒకరు మృతి చెందగా మరోకరికి తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా అక్కడ చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.





## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి
- 40 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన టీడీపీ ఇన్‌చార్జి

**మంత్రాలయం, అక్టోబరు09, ప్రభాతవార్త;** సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, బీజేపీ ఇన్‌చార్జి ఎన్.విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం 40 మంది లబ్ధిదారులకు రూ.13,76,872 సీఎం సహాయ నిధి చెక్కులను వారు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు పేదల పక్షపాతిగా పాలన సాగిస్తున్నారన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో వివిధ కారణాలతో అనారోగ్యంపాలైన వారికి వైద్య చికిత్సల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం మండలాధ్యక్షులు గోపాల్‌రెడ్డి, టీబీఎల్ఎల్‌సీ కర్నూలు చైర్మన్ టిప్పుసుల్తాన్, కౌతాళం సింగిల్ మార్కెట్ యార్డు చైర్మన్ నర్సిరెడ్డి, విండో చైర్మన్ వెంకటపతిరాజు, అడివప్పగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, మంత్రాలయం మాజీ జెడ్పీటీసీ ఆర్.లక్ష్మయ్య, ఐటీడీపీ అధ్యక్షులు బి.రామకృష్ణ, పలువురు కూటమి పార్టీ నాయకులు, బాధితులు పాల్గొన్నారు.




## ప్రజాభిప్రాయ సేకరణలో.. మెరుగైన శాతాన్ని సాధిస్తాం

**: రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతం చేస్తాం : జిల్లా కలెక్టర్**

**నంద్యాల, అక్టోబర్ 09 :** ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణలో నంద్యాల జిల్లా రాష్ట్రంలోనే మెరుగైన ఫలితాలు సాధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సంబంధిత శాఖాధికారులు పరస్పర సమన్వయంతో సమగ్ర ప్రణాళిక ప్రకారం పని చేయాలని ఆమె ఆదేశించారు.గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆధ్వర్యంలో ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లతో సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ స్పేస్‌లో డాక్యుమెంట్ అప్‌లోడ్, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ విభాగం యొక్క మూడు అంచెల నిర్మాణం, సీజనల్ వ్యాధుల నివారణ, మందుల పంపిణీ, ఆసుపత్రుల్లో పారిశుధ్యం, రోగ నిర్ధారణ సేవలు, కొత్త స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ, రైతు సేవా కేంద్రాల తనిఖీలు, రైస్ మిల్లుల ట్యాగింగ్, ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన (పీఎంఏజివై) పురోగతి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ రిలీఫ్ మొత్తాల చెల్లింపులు, ఎస్సీ కార్పొరేషన్ కొనుగోలు చేసిన వాహనాల పారవేత, పెన్షన్ పునఃమూల్యాంకనం వంటి పలు అంశాలపై సమీక్ష చేపట్టారు. నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ రామునాయక్, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో ప్రజాభిప్రాయ సేకరణ అంశాన్ని



అత్యంత ప్రాముఖ్యంగా పరిగణిస్తున్నామని, ప్రజల అభిప్రాయాలను సమగ్రంగా సేకరించి మెరుగైన శాతం సాధించడమే లక్ష్యమని తెలిపారు. ఇటీవల తాను బేతంచర్ల మండలంలోని ఆర్.ఎస్. రంగాపురం గ్రామంలో ఉన్న మద్దిలేటి స్వామి ఆలయాన్ని సందర్శించారని, ఆలయంలో ప్రాకారం, గోపురం, మరుగుదొడ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. ఆలయంలో ప్రసాద నాణ్యతను పరిశీలించి ప్రతిరోజూ తాజాగా ప్రసాదం తయారు చేసేలా ఆలయ నిర్వాహకులకు సూచనలు ఇచ్చినట్లు ప్రధాన కార్యదర్శికి వివరించారు. రెవెన్యూ అంశాలపైనా జిల్లా పరిపాలన ప్రత్యేక దృష్టి సారిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 25 వేల జాయింట్ ఎల్పిఎంలు పరిష్కరించబడ్డాయని, పెండింగులో ఉన్నవాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భూ సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసి, భూసంబంధిత వివాదాల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. అంతకుముందు సి.ఎస్. మాట్లాడుతూ ప్రజా సేవలు గ్రామ, వార్డు స్థాయిల్లో సమర్థవంతంగా అమలవ్వాలనే దిశగా అధికారులు కృషి చేయాలని, ప్రజల విశ్వాసం పొందడం ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని సూచించారు.

## ప్రధానమంత్రి పర్యటనను.. విజయవంతం చేద్దాం

**: అధికారులందరూ సమన్వయంతో పని చేయాలి : జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**



**కర్నూలు, అక్టోబర్ 09, ప్రభాతవార్త :** జిల్లాలో ప్రధానమంత్రి పర్యటనను విజయ వంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ నన్నూరు టోల్ గేట్ సమీపంలోని రాగమయూరి వద్ద ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ ప్రాంగణానికి సమీపంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలో పర్యటన ఏర్పాట్ల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హెలిప్యాడ్ ఏర్పాట్ల పురోగతిపై ఆర్అండ్‌బీ ఎస్ఈతో సమీక్షించారు. ఎస్ఈ వివరించినట్లు, ప్రధానమంత్రి కోసం 3 హెలిప్యాడ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, గ్రావెల్ వేసి, మెటల్ మరియు బిటుమెన్ లేయర్లను వేయాల్సి ఉందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు. 11 పార్కింగ్ ప్రదేశాల్లో మొక్కలు తొలగింపు, లెవెలింగ్ పనులు పూర్తయ్యాయని, ఇంటర్నల్ రోడ్లు అక్టోబర్ 11 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పార్కింగ్ ఇన్‌చార్జిలుగా ఉన్న ఇరిగేషన్ ఎస్ఈ, పంచాయతీ రాజ్ ఎస్ఈ, హౌసింగ్ పీడీ, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. పార్కింగ్ ప్రదేశాల్లో మెడికల్ క్యాంపులు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఫైర్ ఇంజన్లు, టాయిలెట్లు, అంబులెన్సులు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. షామియానా ఏర్పాటు కోసం మాన్ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. అలాగే పార్కింగ్ ఏరియా, సభా ప్రాంగణం, రహదారులు, ఆహార పంపిణీ ప్రదేశాల్లో స్పష్టమైన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు. హెల్ప్ డెస్క్‌లు పార్కింగ్ ప్రదేశాల్లో మరియు నన్నూరు టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేయాలని, రోడ్డు డివైడర్‌ల వద్ద ప్లాంటేషన్ బాగా చేయాలని కలెక్టర్ సూచించారు. టాయిలెట్ ఏర్పాట్లపై సమీక్షలో మున్సిపల్ కమిషనర్ తెలిపారు. పారిశుధ్య పనులు నిరంతరంగా సాగాలని, అక్టోబర్ 11 నుండి రాత్రిపూట షిఫ్ట్‌లను ఏర్పాటు చేయాలని డీపీఓకు సూచించారు. ప్రతి పార్కింగ్ ప్రదేశంలో 3 ట్రాక్టర్లు, అవసరమైన శానిటేషన్ సిబ్బందిని నార్మ్స్ ప్రకారం నియమించాలని ఆదేశించారు. సభకు హాజరయ్యే ప్రజలకు బస్సుల్లో భోజనం మరియు తాగునీరు అందించేలా డీఎస్ఓ చర్యలు తీసుకోవాలని, ఒక్కొక్కరికి 3 లీటర్ల నీరు అందించేలా ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈను ఆదేశించారు. నన్నూరు టోల్ ప్లాజా వద్ద మరియు 8 అప్రోచ్ రోడ్ల వద్ద ప్రజలకు మజ్జిగ, త్రాగునీరు అందించేలా సూచించారు. ప్రతి పార్కింగ్ ప్రదేశంలో 2 అంబులెన్సులు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, గ్యాలరీలలో ఎంబిబిఎస్ వైద్యులు మరియు పారా మెడికల్ సిబ్బంది ఉండేలా చూడాలని ఆదేశించారు. అక్టోబర్ 12 నాటికి 20 బెడ్ మరియు 10బెడ్ ఆసుపత్రులను సిద్ధం చేయాలని సూచించారు. కల్చరల్ ప్రోగ్రామ్ స్టేజ్‌ను ప్రధాన వేదికకు కుడివైపున ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. హెలిప్యాడ్, సభ ప్రాంగణం, గ్రీన్ రూమ్, లైవ్ కవరేజ్ కోసం అవసరమైన నెట్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని బీఎస్ఎన్ఎల్ అధికారులను ఆదేశించారు. అన్ని పార్కింగ్ ప్రదేశాల్లో లైటింగ్ పనులు పూర్తి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులకు సూచించారు. రవాణా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని, కాన్వాయ్ వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని డిటీసీకి సూచించారు. యూనియన్ మంత్రులు కూడా ఆరుగురు రావచ్చుని, అందువల్ల అదనపు కాన్వాయ్ వాహనాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. బి. నవ్య, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఆదోని సబ్ కలెక్టర్ మోర్య భరద్వాజ్, ఆర్డీఓ సందీప్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్ర రెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ పాండు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## బాబు షూరిటీ ప్రజలకు మోసం గ్యారెంటీ..!

**: ఇంటింటికి ప్రచారం.. మాజీ ఎంపీ బుట్టా రేణుక**



**నందవరం అక్టోబర్ 9 ప్రభాతవార్త :** సాధారణ ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను సంపూర్ణంగా అమలుపరుస్తామని నమ్మించి వంచించిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని కర్నూలు జిల్లా మాజీ ఎంపీ , ఎమ్మిగనూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి బుట్టా రేణుక అన్నారు. గురువారం మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో బాబు షూరిటీ ప్రజలకు మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నందవరం మండలం ఉపాధ్యక్షులు పల్దొడ్డి కోటేశ్వర, మాచపురం సర్పంచ్ కిష్టప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముందుగా ఆమెకు గ్రామ వైసీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆమె కూటమి ప్రభుత్వం వైసీపీ కార్యకర్తలపై దౌర్జన్యం చేస్తున్న సమస్యలకు మాజీ ముఖ్యమంత్రి చేపట్టిన క్యూఆర్ కోడ్ గురించి తెలిపారు.ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారం లో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలను నిట్టు నిలువును మోసం చేసిందని ప్రజలకు తెలియపరిచారు. అంతేకాకుండా సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ అంటూ కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున గొప్పలు చెప్పుకోవడం వారికి సిగ్గుగా లేదా అని ఆమె ఎద్దేవశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను సక్రమంగా నెరవేర్చి ప్రజలకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూర్ సీనియర్ నాయకులు నీలకంఠప్ప, కె ఆర్ మురారెడ్డి, రాష్ట్ర మేధావుల సంఘం నాయకులు కే ఆర్ లక్ష్మీకాంత్ రెడ్డి,రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి ముగతి విరుపాక్షి రెడ్డి, సీనియర్ నాయకులు రామకోటేశ్వర్ రెడ్డి, హాలహర్వి సావిత్రమ్మ, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు సోమల గూడూరు వెంకటేశ్వర రెడ్డి, నియోజవర్గ ప్రచార విభాగం అధ్యక్షులు నది కైరవాడి చాంద్ బాషా, మండల యూత్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాష్ రెడ్డి, మండల కార్యదర్శి నది కైరవాడి వెంకటేష్, జిల్లా స్టూడెంట్ విభాగం నాయకులు ప్రకాష్ రెడ్డి, నందవరం ఎల్లా గౌడ్,రమేష్ గౌడ్, మీసాల సంపత్ గౌడ్, నాగలదిన్నె మాజీ సర్పంచ్ ప్రభాకర్, నరసింహులు, ఎంపిటిసి అతువుల్లా, జిల్లా బీసీ నాయకురాలు హాలహర్వి సావిత్రమ్మ,, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులు గెలుపుఓటములను సమానంగా స్వీకరించాలి



**పగిడ్యాల, అక్టోబరు 9,ప్రభాతవార్త :** క్రీడాకారులు గెలుపుఓటములను సమానంగా స్వీకరించాలనీ మండల విద్యాశాఖాధికారులు పి సుభాన్, యర్రం మురళీమోహన్‌రెడ్డి అనా న్నరు. స్థానిక జెడ్పీ పాఠశాల క్రీడామైదానంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం అండర్ 14 అండ్ 17, మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక కార్యక్రమము నిర్వహించారు. ముందుగా జెడ్పీ పాఠశాల హెచ్ఎం మధుసూధనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓలు మాట్లాడుతూ క్రీడాపోటీలను ఓడిపోతే కృంగిపోరాదనీ, ఓటమి రేపటి విజయానికి సంకేతమన్నారు. రాష్ట్ర, దేశస్థాయిలో ప్రతిభను కనబరిచిన క్రీడాకారులకు ఇచ్చే దృవపత్రాలవల్ల 3శాతం రిజర్వేషన్ కల్పించడం వల్ల ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. మండల కన్వీనర్ చంద్రమోహన్ మాట్లాడుతూ కబడీ, ఖో-ఖో, వాలీబాల్, చెస్, యోగ, బాల్‌బాడ్మింటన్ అథలిటిక్స్ పోటీలుంటామయన్నారు. మండలస్థాయిలో ప్రతిభకనబరిచిన క్రీడాకారులు డివిజన్, జిల్లా స్థాయిలో ప్రతిభను కనబరిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవుతారన్నారు. విజ్జిఅసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుంపుల వెంకటేశ్వర్లు, కార్యదర్శి క్రీడాశ్రీ పీతాంబరెడ్డి మాట్లాడుతూ క్రీడలు వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తాయనీ, క్రమశిక్షణ స్నేహభావం జాతీయ భావం పెరుగుతుందన్నారు. మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ మల్లికార్జున రెడ్డి, నెహ్రూనగర్ హెచ్ఎం పి.నాగన్న ప్రసంగించారు. క్రీడాపోటీలను ఎంఈఓలు, హెచ్ఎంలు ప్రారంభించారు. ఈ క్రీడాపోటీలలో మండలంలోని ఆయాపాఠశాల క్రీడాకారులు పాల్గొన్నారు.



## మిస్సింగ్ కేసు నమోదు

**మంత్రాలయం, అక్టోబరు09, ప్రభాతవార్త;** మండలంలోని మాధవరం పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. వివరాల మేరకు... పరమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన భీమన్నగౌడ్ కుమార్తె ఇందుశ్రీ అనే యువతి ఈనెల 6వ తేదీన వారి మేనమామ ఊరు అయిన ఉరుకుంద గ్రామానికి వెళ్తానని చెప్పి వెళ్లిందన్నారు. అయితే యువతి ఉరుకుందకు వెళ్లకుండా మిస్సింగ్ అయినట్లు తెలిపారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు

**కర్నూలు విద్య, అక్టోబర్ 9, ప్రభాతవార్త:** స్థానిక కెవిఆర్ ప్రభుత్వ మహిళ కళాశాలలో గురువారం జిఎస్టీ 2.0పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఎస్టీ పన్ను తగ్గింపుతో సమాజానికి వివిధ సంస్థలకు, చిన్నవ్యాపార సంస్థలకు కలిగే లాభాలు వివరించారు. విద్యార్థినిలు భవిష్యత్తులో పన్ను వ్యవస్థ అకౌంటింగ్, వ్యాపార రంగాల్లో పొందగల అవకాశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు స్థానిక వ్యాపారులు, కమ్యూనిటిలోని ప్రజల్లో జిఎస్టీ 2.0పై అవగాహన పెంపొందించాలని పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ డా.జివి రంగారెడ్డి మాట్లాడుతూ జిఎస్టీకి సబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ (టోల్‌ఫ్రీనం.) ప్రత్యేక సెల్ ఏర్పాటుచేయవచ్చని సూచించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ బి నిఖిత, కీర్తికుమారి, డా.ఎంసి సాహిత్య, డా.వై నూర్ బాష, శ్రీమతి విజయలక్ష్మి , తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేద్దాం



**వెలుగోడు, అక్టోబరు 9, ప్రభాతవార్త :** ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 16న జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నంద్యాల జిల్లా బిజేపి ఉపాధ్యాక్షుడు ధూపాటి మురళీధర్ చౌదరి పిలుపు నిచ్చారు. గురువారం స్తానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు ప్రధాన మోడీ పర్యటన ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలకు ఎంతో గర్వకారణం. ఈ పర్యటనలోల శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జుస్వామివార్లను దర్శించుకున్న అనంతరం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరులో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్ కార్యక్రమం దేశ వ్యాప్తంగా పెద్ద స్థాయిలో జరుగుతోందని, ఆ ఉత్సవ్‌లో భాగంగానే ప్రధాని పాల్గొనే ఈ సభ చారిత్రాత్మకంగా నిలుస్తుందని మురళీచౌదరి పేర్కొన్నారు. సభ విజయవంతం కావడానికి కూటమి బిజేపి కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని, గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రజలను తరలించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు పోతుల రాజశేఖర్‌రెడ్డి, నూలు నాగేశ్వరరావు, ప్రతాప్ ఆచారి, మహేష్, తిరుపాల్‌నాయక్, మధు పాల్గొన్నారు.

## బడుగు బలహీనవర్గాల అభివృద్దే కూటమి ధ్యేయం

**- టిడిపి మండల అధ్యక్షుడు ముమ్మడి నాగ కృష్ణారెడ్డి**



**బండిఆత్మకూరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త:** పేద బడుగు బలహీనవర్గాల అభివృద్ధే కూటమి ధ్యేయమని టిడిపి మండల అధ్యక్షుడు ముమ్మడి నాగ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో టిడిపి నాయకుడు వై జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సూపర్ జిఎస్టీ,సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షులు ముమ్మడి నాగ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సూపర్‌జిఎస్టీ తగ్గింపుతో పేద మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో లాభదాయకంగా ఉందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ పనిముట్ల పరికరాలపై జిఎస్టీ తగ్గింపుతో రైతులు పనిమట్లను కొనుగోలు చేసే ప్రక్రియలో ఆర్థికభారం తగ్గిందని వారు తెలిపారు. జిఎస్టీ ఎలక్ట్రానిక్ వస్తువులపై ప్రభావం, సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరి శ్రమల్లో జిఎస్టీపై గ్రామ ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయడంలో చంద్రబాబు నాయకత్వం ముందుందన్నారు. శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేస్తున్నా రన్నారు. స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకానికి మహిళలు బ్రహ్మారథం పడుతున్నారని తెలిపారు. అనంతరం సూపర్ జిఎస్టీపై ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో గోవిందరెడ్డి, పరమటూరు సహకారం సంఘం చైర్మన్ సాయిబాబారెడ్డి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల అండగా ఉంటాము



**గోనెగండ్ల, అక్టోబరు 9, ప్రభాతవార్త :** గ్రామా పంచాయతీలలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఎల్లవేళల అండగా ఉంటామని గ్రామ మేజర్ సర్పంచ్ హేమావతి,కార్యదర్శి సతీష్ అన్నారు.గురువారం గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న 18 మందికి నూనె, సబ్బులు, యూనిఫామ్‌లను అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఈ రోజు గ్రామాల శుభ్రం గా ఉన్నాయంటే అది కేవలం పారిశుద్ధ్య కార్మికుల ద్వారనే సాధ్యమైందన్నారు.తడి చెత్త,పొడిచెత్తలను సేకరించి కంపోస్టు ఎరువులను తయారు చేయడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర చెప్పుకోతగినదన్నారు. పంచాయతీ సిబ్బంది శానిటరీ ఇన్స్‌ఫెక్టర్ మలాంగ్, సుభాన్, అనిల్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు జడ్జి బి ఆర్ గవాయ్‌పై దాడి హేయమైన చర్య



**ఆళ్లగడ్డ, అక్టోబర్ 9, ప్రభాతవార్త:** దేశ అత్యున్నత నా య్యయస్థానం సుప్రీంకోర్టు జడ్జి బిఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ చెప్పు విసరడం హేయమైన చర్య అని మాల మహానాడు రామోజీ ఇమ్మానుయేల్‌వర్గం నంద్యాల జిల్లా ఇంచార్జీ బి చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రమళ్ల చక్రవర్తిలు ఖండించారు. గురువారం ఆళ్లగడ్డ పట్టణంలో నాలుగు రోడ్ల సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. ఈనిరసన కార్యక్రమానికి జేఏసి కనీ ్వనర్ బీరువాల బాషా మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు జడ్జి బి ఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిశోర్ చెప్పు విసరడం దుర్మార్గం అన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్ య దేశంగా ఉన్న మన భారతదేశంలో ఇటువంటి మతపరమైన అంశాలు లేవనెత్తడం సరికాదన్నారు. దాడిచేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్‌చేశారు. మాలమహానడు రామోజీ ఇమ్మానుయేల్‌వర్గం ఆళ్లగడ్డ అధ్యక్షులు బద్రి వెంకటనారాయణ, రుద్రవరం మండల అధ్యక్షులు కేత బ్రహ్మం, ఆళ్లగడ్డ జక్కరయ్య, షేక్ నూర్ బాష పాల్గొన్నారు.

## కొలనుభారతి అమ్మవారికి బంగారు పుస్తేలు బహుకరణ



**కొత్తపల్లె, అక్టోబర్ 9, ప్రభాతవార్త:** ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన కొలనుభారతి క్షేత్రంలో అమ్మవారికి నంద్యాల ఆర్యవైశ్య మహిళా మండలి వాసవి మాంగళ్యం సంఘం సభ్యులు ఇందుమతి, శోభారాణిలు సుమారు లక్షరూపాయల విలువచేసే రెండు బంగారు పుస్తేలు ఆలయ ఈవో రామలింగారెడ్డికి బహుమానంగా అందజేశారు.

## ఎపి రైతు సంఘం జిల్లా మహాసభలు జయప్రదం చేయండి



**ఆత్మకూరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.వెంకటేశ్వరరావులు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు చేయడానికి కార్యక్రమాలు రూపొందించుకొని, వెలుగోడు రిజర్వాయార్, వన్‌ఎల్, వన్ ఆర్ తూముల ఏర్పాటుకు గుంతకందాల ఎడారి ప్రాంతానికి సాగునీరు కోసం, పాములపాడు మండలంలో సాగు నీరు లిఫ్టుల కోసం ఉద్యమాలు చేపట్టి వేల ఎకరాలకు సాగునీరు అందించడంలో రైతు సంఘం కీలకపాత్ర పోషించిందన్నారు. ఎపి రైతు సంఘం మహసభలు అక్టోబర్ 11, 12 తేదిలలో ఆత్మకూరు పట్టణంలో జరుగుతున్నాయని రైతులందరు తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజు, నాగేశ్వరరావు, సామేలు, పాల్గొన్నారు.

## రైతుల సమస్యలపై పోరాడుదాం



**దేవనకొండ, అక్టోబరు 9, ప్రభాతవార్త;** జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సాగునీటి కోసం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమి స్తామని, అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా పంట కాలువల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని రాయ లసీమ సాగునీటి సమితి అధ్యక్షులు దశరథ రామిరెడ్డి, జిల్లా కన్వీనర్ శేషాద్రిరెడ్డి పేర్కొన్నారు. గురు వారం దేవనకొండలోని క్రాస్ రోడ్డులోని ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సాగునీటి వనరులపై రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పందికోన రిజర్వాయర్, కుడి, ఎడమ కాలువల పరిధిలోని మాచాపురం, బండగట్టు, నెల్లిబండ, వెలమకూరు, కూకటికొండ గ్రామాల్లో పర్యటించి పంట కాలువలను పరిశీలించామన్నారు. పందికోన రిజర్వాయర్ నుంచి పత్తికొండ, దేవనకొండ మండలాల్లో 60 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యం నీరుగారిపోయిందన్నారు. పాలక ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నిధుల కేటాయింపు జరగక పంట కాలువలు ముళ్ల కంపలతో అధ్వానస్థితికి చేరుకున్నా యన్నారు. జిల్లాలో సాగునీటి వనరులపై రైతులతో కలిసికట్టుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వం హంద్రీనవా పంట కాలువల కోసం రూ.210 కోట్లు ప్రతిపాదనలు పంపామని తెలుపుతున్నప్పటికీ నిధులు మంజూరు చేసి పంట కాలువలను పూర్తి చేస్తే ప్రతి ఎకరాకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఆలూరు నియోజకవర్గంలో వేదావతి ప్రాజెక్టు నిర్మాణానికి పాలక ప్రభుత్వాలు చొరవ తీసుకోకుంటే తాగు, సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సాగునీటి సమితి నాయకులు కాశీ విశ్వనాథ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, తెర్నెకల్ సర్పంచ్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

## మహిళలు స్వయంశక్తితో ఎదగాలి



**వెల్దుర్తి, అక్టోబర్ 9, ప్రభాతవార్త :** మహిళలు స్వయంశక్తితో ఎదగాలని వెల్దుర్తి డిప్యూటీ తహశీల్దార్ గురుస్వామిరెడ్డి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమావేశ భవనంలో జిల్లారెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్.రఘునాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ గురుస్వామిరెడ్డి, వెల్దుర్తి మండల రెడ్‌క్రాస్‌సొసైటీ సబ్‌బ్రాంచ్ ఛైర్మెన్ కె.పి.ఆచారి,కమిటీ సభ్యులు హాజ రయ్యారు.స్థానిక రెడ్‌క్రాస్‌సొసైటీ కార్యాలయంలో మహిళలకు చాలా సంవత్సరాలుగా టైలరింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. టైలరింగ్ టీచర్ భాగ్యలక్ష్మీ దాదాపు 40 మంది మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. వీరందరికి డిటి గురుస్వామిరెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.రెడ్‌క్రాస్‌సొసైటీ సభ్యులు పరమేష్, వి.యం.హరిసింహానాయుడు, చంద్రశేఖర్, సుంకన్న,శివకుమార్ పాల్గొన్నారు.

## ఉత్తమ పాఠశాలగా ఆదోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల

**- హెచ్ఎం ఫయాజుద్దీన్ సేవలు మరువలేనివి**



**ఆదోనిలీగల్, అక్టోబరు 9, ప్రభాతవార్త;** ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌కు ఉత్తమ పాఠశాల అవార్డును రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, జాయింట్ కలెక్టర్ నవ్య చేతులమీదుగా ఇటీవల అందుకున్నారు. రెండవ వార్డు కౌన్సిలర్ సురేష్, ముని ఆధ్వర్యంలో పాఠశాల హెచ్ఎం ఫయాజుద్దీన్‌ను సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ హెచ్ఎం ఫయాజుద్దీన్ సేవలు మరువలేనివన్నారు. ఆయన హయాంలో పాఠశాల అభివృద్ధి చెందిందన్నారు. పాఠశాలకు ఆయన చేసిన సేవలు, కృషిని వారు కొనియాడారు.

## కలుగోట్లలో 8వ రాష్ట్రీయ పోషణ కార్యక్రమం



**వెల్దుర్తి, అక్టోబర్ 9, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కలుగోట్ల గ్రామం ఎస్సీ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సిడిపిఓ లూక్,సూపర్‌వైజర్ శ్రీదేవి హాజరయ్యారు.వారి చేతుల మీదుగా చిన్నారులకు పోషకాహారం తినిపించారు.ఐవైసిఎఫ్ గురించి తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు,బాలింతలకు,ప్రీస్కూల్ పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు.1000రోజుల కేర్ గురించి సిడిపిఓ,సూపర్‌వైజర్‌లు వివరించారు. ఆకుకూరలు,చిరుధాన్యాలు ప్రతిరోజు భోజనంలో తినాలన్నారు. గర్భవతులు, బాలింతలు తీసు కోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.చిన్నారులకు వారు అన్నప్రాసన చేశారు.బిడ్డలకు బిసిజి,డిటిపి టీకాలు, పోలియోచుక్కలు మిజిల్స్ వేయించాలన్నారు.భోజనం తయారీకి ముందు,తరువాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు కామేశ్వరి,శాంతి,లక్ష్మీదేవి,హెల్పర్లు నాగేంద్రమ్మ, రాధిక, మహేశ్వరి, గర్భవతులు, బాలింతలు,ప్రీస్కూల్ పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

**వెల్దుర్తి, అక్టోబర్ 9, ప్రభాతవార్త :**



రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్య క్షులు అయ్యన్న, ఆంధ్ర ప్రదేశ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు నాగసురేంద్రయాదవ్‌లు డిమాండ్ చేశారు.స్థానిక కెవిఆర్ కళా శాలలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గత 6 సంవత్స రాలుగా దాదాపు రూ.6400 కోట్లకు పైగా స్కాలర్‌షిప్,ఫీజు రీయంబర్స్ మెంట్ విడుదల చేయాల న్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన విద్యార్థుల సమస్యలు పరిష్కరించడం లేద న్నారు. జీవో నెంబర్77 రద్దు చేసి పిజి,ఎంబిఏ,ఎంసిఏ,బిఇడి కోర్సులు చదువుతున్న విద్యార్థులకు సైతం స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు సూర్య, మహి, రాజేష్, సురేష్,రాజు పాల్గొన్నారు.

## సొంత ఖర్చుతో రోడ్డుకు గ్రావెల్ వేయించిన మిక్కిలినేని కిరణ్‌కుమార్



**హొళగుంద, అక్టోబరు 9, ప్రభాతవార్త;** హొళగుంద మండలంలోని హొన్నూరు కొట్టాల రహదారికి తన సొంత ఖర్చుతో టీడీపీ యువ నాయకుడు నిఖిల్ మిక్కిలినేని కిరణ్‌కుమార్ గ్రావెల్ వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుంగభద్ర ప్రాజెక్టు ఎల్ఎల్‌సీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మిక్కిలినేని వెంకటశివప్రసాద్ ఆదేశాల మేరకు గ్రావెల్ వేయడం జరిగిందన్నారు. గత నెలలో కురిసిన వర్షానికి రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు, రైతులకు రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. స్పందించిన యువ నాయకుడు కిరణ్‌కుమార్ సొంత ఖర్చులతో రోడ్డుకు గ్రావెల్ వేసి చదును చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.టీడీపీ నాయకులు మిక్కిలినేని సుబ్బారావు, మిక్కిలేని రమేష్, మిక్కిలినేని విజయభాస్కర్, మహబూబ్‌బాషా, మిక్కిలినేని శ్రీనివాసరావు, కోడలి వేణుగోపాల్, కురువ మల్లికార్జున పాల్గొన్నారు.

## సూపర్ జిఎస్టీతో ఎంతో ప్రయోజనం



**మహానంది, అక్టోబర్ 9, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిన సూపర్ జిఎస్టీ, సూపర్ సెవింగ్స్‌తో ప్రజలకు ఎంతో ప్రయోజనమని కెసి కెనాల్ ప్రాజెక్టు చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి అన్నారు. గురువారం మహానంది మండలంలోని బుక్కాపురంలో సూపర్ జిఎస్టీ,సూపర్ సెవింగ్స్ కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు కంచర్ల శివశంకర్ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర ్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల మాదిరిగానే సూపర్ జిఎస్టీ కూడ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, నిత్యావసర వస్తువులపై కూటమి ప్రభుత్వం జిఎస్టీ తగ్గించి ప్రజలపై పడే ఆర్థికభారాన్ని తగ్గించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రాక్టర్‌ల విడిభాగాలకు, పంట రక్షణ,పోషణకు సంబంధించిన ఉపకరణాలకు, అత్యాధునిక వ్యవసాయ పరికరాలకు జిఎస్టీ తగ్గింపు చేసి సాగుఖర్చు తగ్గించిందన్నారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్వినిరెడ్డి, టిడిపి నాయకులు మారెడ్డి జయరాముడు, మారెడ్డి సుబ్రమణ ్యం, ఆత్మకూరు మార్కెట్‌యార్డు కమిటీ మెంబర్ మారెడ్డి కుమారి, ఉప సర్పంచ్ ఉశేని, భూపాల్‌రెడ్డి, రామయ్య, నాగరాజు, మిద్దె చంద్రశేఖర్, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక శారీరక వికాసాన్ని ఇస్తాయి



**గోనెగండ్ల, అక్టోబరు 9, ప్రభాతవార్త :** క్రీడలు మానసిక,శారీరక వికాసాన్ని ఇస్తాయని క్రీడలను ప్రతి విద్యార్థి ఆడాలని ఎంపీడీవో మణిమంజరి అన్నారు.గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా క్రీడాలను పోటీలను ఎంపీడీవో ప్రారంభించారు.ఈ పోటీలలో మండలంలోని పలు పాఠశాలల నుంచి అండర్ 14,అండర్ 17,క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపీడీవో మణిమంజరి,ఎంఈవోలు రామాంజినేయులు, నీలకంఠ మాట్లాడుతూ ఈ పోటీలలో కబడ్డీ, కోకో, క్రికెట్, వాలీబాల్, షటిల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తామన్నారు. గురువారం, శుక్రవారం అ పోటీలను మండల స్థాయిలో నిర్వహిస్తామని అందులో ప్రతిభ కనపరచి గెలుపొందిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయికి జిల్లాస్థాయి, రాష్ట్ర , జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక చేస్తారని తెలిపారు.ఉన్నత పాఠవాల హెచ్ ఎం నాగభూషణం, పీఈటీ మాస్టర్ జాకీర్‌హుస్సేన్, పలు పాఠశాలల పీఈటీ మాస్టర్లు పాల్గొన్నారు.

## నేడు టీడీపీ సభ్యత్వం కార్డులు పంపిణీ కార్యక్రమం



**దేవనకొండ, అక్టోబరు 9, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన దేవనకొండలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్ ఆదేశాల మేరకు టీడీపీ సభ్యత్వం కార్డులు పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల బూతులకు సంబంధించిన పార్టీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పౌష్టికాహారం బాల్యవివాహాల దుష్ఫలితాలపై అవగాహన

**- ఐసిడిఎస్ ఆత్మకూరు ప్రాజెక్టు సడిపిఓ కోటేశ్వరీ**

**బండిఆత్మకూరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త:**



మండలంలోని నెమ్మళ్ళకుంట మజరా గ్రామంలో 8వ రాష్ట్రీయ పోషణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఐసిడిఎస్ ఆత్మకూరు ప్రాజెక్టు సిడిపిఓ కోటేశ్వరీ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చెంచు గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రాముఖ్యత గురించి బాల్యవివాహాల దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతోఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం తయారి విధానం పోషకవిలువలు కాపాడుకునే వంట విధానాలపై డెమోనిస్ట్రేషన్ నిర్వహించారు. అనంతరం బయమ్మ అనే గర్భిణికి శ్రీమంతం నిర్వహించారు. అనంతరం గ్రామ పరిసరాల్లో పోషణ, బాల్య వివాహాల నివారణపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం చెంచు మహిళలకు పండ్లు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, జయలక్ష్మీ,కోమల, కవిత, పంచాయితీ కార్యదరి ్శ, అంగన్వడి కార్యకర్తలు, చెంచు మహిళలు పాల్గొన్నారు.

## జొన్న(స్వర్ణ)..గిరి..!

**(మొదటి పేజీ తరువాయి ) :** మన ఆంధ్రా రాష్ట్రంలోనే ఈ బంగారు గని ఉంది. ఈ గనిని దక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ యాజమాన్యం నిర్వహించనుంది. చమురు తర్వాత బంగారమే..! భారతదేశంలోని మొట్టమొదటి పెద్ద ప్రైవేట్ బంగారు గని త్వరలో ఆంధ్రప్రదేశ్లో పూర్తి స్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించనుందని దక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ ఉన్నతాధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతదేశం ప్రస్తుతం ఏటా 1,000 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటుందని మీకు తెలుసా. ఇక్కడ మరో షాకింగ్ విషయం ఏమిటంటే.. ఇండియా చమురు తర్వాత దిగుమతి చేసుకునేది బంగారాన్ని. అయితే ఈ గని ప్రారంభమైన తర్వాత భారత్ బంగారం దిగుమతులపై ఆధారపడటం కచ్చితంగా తగ్గుతుందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బిఎస్ఈ లో జాబితాలో నమోదు అయిన దక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (డిజీఎంఎల్) దేశంలో మొట్టమొదటి, ఏకైక బంగారు అన్వేషణ సంస్థ. ఆంధ్రప్రదేశ్లోని జొన్నగిరిలో ప్రైవేట్ రంగంలో మొట్టమొదటి బంగారు గనిని అభివృద్ధి చేస్తున్న జియోమైసోర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్లో ఈ కంపెనీకి వాటా ఉంది. జొన్నగిరి బంగారు ప్రాజెక్టుకు జూన్, జూలైలలో పర్యావరణ అనుమతి లభించిందని, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కూడా అనుమతులు కోరింది. గనికి దారేది..? ఈ బంగారు గని ఆంధ్రప్రదేశ్లోని కర్నూలు జిల్లాలోని తుగ్గలి మండలం పరిధిలోని జొన్నగిరి, ఎర్రగుడి, పగడిరై గ్రామాల సమీపంలో ఉంది. 2003లో బంగారం కోసం అన్వేషించడానికి డిజీఎంఎల్ స్థాపించారు. డిజీఎంఎల్ గతంలో భారతదేశం సహా విదేశాలలో బంగారం అన్వేషణ కార్యకలాపాలలో పాల్గొంది. కంపెనీ మైనింగ్ ఆస్తులు భారతదేశం సహా పలు దేశాల్లో విస్తరించి ఉన్నాయి. ఈసందర్భంగా దక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ హనుమాన్ ప్రసాద్ మాట్లాడుతూ.. భారతదేశంలో బంగారు ఉత్పత్తి 1.5 టన్నులు ఉందని తెలిపారు. వాళ్ల గని పని ప్రారంభించిన తర్వాత ఉత్పత్తి దాదాపు ఒక టన్ను పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఎంత ఉత్పత్తి అవుతుందంటే..! ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం స్థిరీకరణ దశలో ఉందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ప్లాంట్ సాంకేతికతపై మాత్రమే పని జరుగుతోందని, పూర్తి స్థాయి ఉత్పత్తి అతి త్వరలో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పూర్తి స్థాయి ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత ప్రాజెక్ట్ ద్వారా ఏడాదికి సుమారు 750 కిలో గ్రాముల బంగారాన్ని ఉత్పత్తి చేస్తుందని అంచనా. అయితే రెండు నుంచి మూడు ఏళ్లలో ఉత్పత్తిని 1,000 కిలోగ్రాములకు పెంచుతామని, ఇది ఇండియా బంగారం దిగుమతులను తగ్గిస్తుందని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో బంగారం ఉత్పత్తి ప్రారంభమవుతుంది.. ఎండీ ప్రభాకరన్ కర్నూలు జిల్లాలోని జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టులో నవంబరు నుంచి బంగారం ఉత్పత్తి ప్రారంభమవుతుందని జియో మైసూర్ సంస్థ ప్రధాన వాటాదారు, త్రివేణి ఎర్త్ మూవర్స్, లాయ్డ్స్ మెటల్ అండ్ ఎనర్జీ లిమిటెడ్ ఎండీ ప్రభాకరన్ ఓ ప్రకటనలో తెలిపారు. తుగ్గలి మండలం బొల్లవానిపల్లి గ్రామం సమీపంలో కొత్తగా నిర్మించిన కర్మాగారంలో శుద్ధి ప్రక్రియ మొదలవుతుందన్నారు. దేశంలో ప్రైవేటు కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తొలి బంగారు గని ఇదేనన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో పనిచేస్తే ఏడాదికి 500 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. భవిష్యత్తులో ఉత్పత్తి ఇంకా పెరిగే అవకాశం ఉందని, ఇప్పటికే కొత్తగా నిర్మించిన ప్లాంట్లో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. స్థానికంగా యువతకు, భూములిచ్చిన రైతులకు ఉద్యోగాలు కల్పించామన్నారు.

# ఏపీ ద్రోహి.. మోడీ గోబ్యాక్..! 15న బారీ నిరసన ర్యాలీ




**: వామపక్షపార్టీ నేతలు**

**కర్నూలు, అక్టోబర్ 09, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామని, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజి ఇస్తామని చెప్పి మాటతప్పిన మోడీకి కర్నూలులో పర్యటించే హక్కులేదని 16న కర్నూలులో మోడీ పర్యటను + నిరసిస్తూ 15న మోడీ గోబ్యాక్ అంటు నిరసన ర్యాలీ జయప్రదం చేయాలని వామపక్షపార్టీల నేతలు పిలుపు నిచ్చారు. గురువారం సీఆర్ భవన్లో సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ మునెప్ప, నక్కి లెనిన్బాబు, ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం, సీపీఐ నగర కార్యదర్శి పీ రామకృష్ణారెడ్డి, సీపీఎం నాయకులు రాధాకృష్ణ, రాముడు, రాజశేఖర్, నారాయణ, ఎసయూసీఐ నాయకులు నాగన్న, క్రిష్ణలతో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. గిడ్డయ్య, గౌస్దేశాయ్, నాగన్నలు మాట్లాడుతూ 11 సం మోడీ పాలనలో ఏపీకి చేసింది ఏమిలేదన్నారు. జీఎస్టీ రూపంలో 8వేల కోట్ల రూపాయలు అనవసరంగా వసూలు చేస్తున్నారని గతంలో విమర్శలు చేసిన చంద్రబాబునాయుడు నేడు జీఎస్టీ తగ్గించాడని ఉత్సవాలు చేసుకోవడం దుర్మార్గమన్నారు. రాయలసీమకు ఒక్కసాగునీటి ప్రాజెక్టు ఇవ్వకుండా, ప్రత్యేక హెదా ఇవ్వకుండా సంబరాలు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. 11 సంవత్సరాల నుండి జీఎస్టీ భారం మోపీ ప్రజలను ఇబ్బందుల గురిచేసిన వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇస్తారా అని ప్రశ్నించారు. కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తారా లేదా, విశాఖలో స్టీల్ ప్లాంట్ను ప్రైవేటీ కరణను అడ్డుకుంటారా లేదా అన్న విషయం తెలియచేయాలన్నారు. ఈ ప్రాంత ప్రజల కోసం ఏమి చేయకుండా సంబరాలు చేసుకోవడంను వామపక్షపార్టీలుగా ఖండిస్తున్నామన్నారు. ఇందుకు నిరసనగా ఈనెల 15న జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు బారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నా మన్నారు. ఈ ర్యాలీకి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సీపీఎం రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావులు హాజరైతున్నారని తెలిపారు. ఈ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

# వైసిపి ఛీప్ రాజకీయాలు మహోన్నతమై వ్యక్తిపై చూపడమా?

**అంబేద్కరు అవమానించినందుకు నిరసనగా బారీ ర్యాలీ**

**నంద్యాల, అక్టోబరు 9, ప్రభాతవార్త ప్రతినిధి:**





నంద్యాల పట్టణంలో బొమ్మల సత్రము వద్ద ఉన్న అంబేద్కరు విగ్రహానికి యన్యండి ఫిరోస్ నందికోట్కూరు యంయల్ఎతో కలిసి పాలాబిషేకము చేశారు. ఈసందర్బముగా అయన మాట్లాడుతూ వైసిపి ఛీఫ్ రాజకీయాలు మహోన్నతమైన వ్యక్తిపై చూడపము సరికాదన్నారు. ఇటీవల చిత్తూరు జిల్లా దేవళంపేట గ్రామంలో డాక్టరు బిఆర్ అంబేద్కరు విగ్రహానికి వైసిపి నేతలు నిప్పు పెట్టన ఘోర ఘటనను తెలుగు దేశం పార్టి తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఈ ఘటన డాక్టరు బిఆర్అంబేద్కర్ గారి అలోచనలపై అయన సమానత్వంపై వైసిపి నేతలు చేస్తున్న చెత్త రాజకీయాలకు నిదర్శమన్నారు.

# చే ఫ్యాషన్ కాదు పోరాటాల స్ఫూర్తి




**కర్నూలు, అక్టోబర్ 09, ప్రభాతవార్త ప్రతినిధి :** చేగువేరా ఫ్యాషన్ కాదని పోరాటాల స్ఫూర్తి అని సిపిఐ సిపిఎం జిల్లా కార్యదర్శిలు బి గిడ్డయ్య, గౌస్ దేశాయ్ కొనియాడారు చేగువేరా 58 వ వర్ధంతి సందర్భంగా స్థానిక సిఆర్ భవన్లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమానికి ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న గిడ్డయ్య గౌస్ దేశాయ్ మాట్లాడుతూ చేగువేరా ఉద్యమ స్ఫూర్తితో అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తారీఫ్ లకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఉద్యమాల కొనసాగిస్తామని ఈ ఉద్యమంలో విద్యార్థులు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యుద్ధాలకు మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప, ఎన్ లెనిన్ బాబు, జిల్లా సీనియర్ నాయకులు జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి సిపిఎం జిల్లా నాయకులు రాధాకృష్ణ, నారాయణ, నగర కార్యదర్శిలు రాజశేఖర్, రాముడు, ఎస్ యు సి ఐ జిల్లా కార్యదర్శి నాగన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు నగరనాయకులు కళాకారు పాల్గొన్నారు.

# ప్యారా లీగల్ వాలెంటీర్లకు శిక్షణ తరగతులు




**కర్నూలు, అక్టోబర్ 09, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి.కబర్ధి మరియు కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ ఆధ్వర్యంలో ప్యారా లీగల్ వాలెంటీర్లకు 09 102025 నాడు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగినది. ఈ శిక్షణ కార్యక్రమం నందు ప్యారా లీగల్ వాలెంటీర్లకు బాల్య వివాహాల నిరోధక చట్టం, వరకట్నం నిరోధక చట్టం, కార్మిక సంక్షేమ చట్టం, వినియోగదారుల రక్షణ చట్టం, రెవెన్యూ చట్టం, పిల్లల సంరక్షణ చట్టం, మున్నగు చట్టాల గురించి ప్యారా లీగల్ వాలెంటీర్లకు అవగాహన కల్పించడం జరిగింది. లోక్ అదాలత్ లో తగాదా లకు తక్షణ పరిష్కారం లభిస్తుందని ఈ తీర్పుల పై అప్పీల్కు వీలులేదని చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి ఇప్పించడం జరుగుతుందని మరియు లీగల్ సర్వీసెస్ సేవలను గురించి పౌరులందరికీ ప్యారా లీగల్ వాలంటీర్లు అవగాహన కల్పించాలని కోరారు.

# ఎమ్మెల్యే ప్రోగ్రాంలో తెలుగు తమ్ముళ్లు తోపులాట..



**మద్దికెర, అక్టోబరు09, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన మద్దికెరలో ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ పప్పుశన విత్తనాల పంపిణీకి గురువారంనాడు నియోజకవర్గ ఎమ్మెల్యే కె.ఈ.శ్యంబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం టీడీప పార్టీలో ఉన్నత పదవులు అనుభవిస్తున్న ముఖ్య నాయకులు ఒకరికొకరు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తోపులాడుకోవడం జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ విజయ నాయక్ అక్కడికి చేరుకుని సర్ది చెప్పి పంపించారు. ఈ విషయం మండలంలో ఆ నోట ఈ నోట నుంచి మండలవ్యాప్తంగా వ్యాపించింది. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో అధికార పార్టీలో ఇలాంటివి జరగడంతో పార్టీపై పలువురు పలు రకాలుగా గుసగుసలాడుతున్నారు. తోపులాట జరగకముందు ఎమ్మెల్యే రైతులకు సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు అందజేశారు. నాయకులు పారా విశ్వనాథ, గూడూరు ధధుంజయ, రాజన్న, తహసీల్దార్ గుండాల నాయక్, ఎంపీడీఓ కొండయ్య, పారా రాఘవేంద్ర, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ మూల పెద్దమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికై నోటిఫికేషన్

**గడివేముల, అక్టోబరు 9, ప్రభాతవార్త ;**

మండలకేంద్రమైన గడివేములలో వెలిసిన శ్రీ మూల పెద్దమ్మ దేవస్థానంలో నూతన ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం కోసం విజయవాడ దేవదాయశాఖ కమిషనర్ నోటిఫికేషన్ను జారీ జారీ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రామలింగారెడ్డి గురువారం తెలిపారు. ఆసక్తి గల వారు 9 మంది సభ్యులకు మించకుండా దరఖాస్తులను పూర్తి చేసి, నంద్యాలలోని జిల్లా దేవదాయ శాఖ అధికారి కార్యాలయంలో ఈనెల 27వ తేదీలోపు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక దేవస్థాన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

# స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేసిన కౌన్సిలర్

**నందికొట్కూరు, అక్టోబరు 9, ప్రభాతవార్త:**



పట్టణంలోని ఎబియం పాలెం 1వ వార్డులో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను కౌన్సిలర్ చిన్నరాజ లబ్దిదారులకు అందజేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రేషన్ దుకాణాలలో నిత్యావసర వస్తువులు తీసుకున్న వెంటనే అన్లైన్లో నమోదు అవుతుందని ఎక్కడ అక్రమాలకు తావులేకుండా క్యూఆర్కోడ్తో ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# నేడు మండల సర్వసభ్య సమావేశం



**హాలహర్వి, అక్టోబరు 9, ప్రభాతవార్త ;** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ నెట్టికంటమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి గురువారం విలేకరులకు తెలిపారు. ఆమె మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో మండల అభివృద్ధి, గ్రామాల్లో తాగునీరు, విద్య, వైద్యం తదితర అంశాలపై సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

# జీఎస్టీ తగ్గింపు సామాన్యులకు వరం

**– ఎంపీడీఓ వరలక్ష్మి – ప్రజలకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించిన ఎంపీడీఓ, అధికారులు**



**హాలహర్వి, అక్టోబరు 9, ప్రభాతవార్త;** కేంద్ర ప్రభుత్వం అమలు చేసి తగ్గించిన జీఎస్టీ సామాన్య ప్రజలకు వరమని ఎంపీడీఓ వరలక్ష్మి అన్నారు. గురువారం మండలకేంద్రమైన హాలహర్విలో ఇంటింటికి తిరిగి జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకుని జీఎస్టీని తగ్గించడం జరిగిందన్నారు. గతంలో జీఎస్టీ ఐదు శ్లాబులుగా ఉండేదని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకుని రెండు శ్లాబులుగా ఖరారు చేసిందని తెలిపారు. జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను ఆమె ప్రజలకు విరించారు. జీఎస్టీ తగ్గింపుతో సామాన్య ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, ఓం ప్రకాష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ తపాల దినోత్సవ వేడుకలు




**కోడుమూరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త :** కోడుమూరు పట్టణంలో ప్రపంచ తపాల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక నాగార్జున విద్యానికేతన్లో గురువారం జరిగిన తపాల దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరుపుకున్నారు. పాఠశాల అద్యాపక బృందం నాటి పోస్టల్ వ్యవస్థలో ఉపయోగించిన పోస్టు కార్డులు,స్టాంప్స్ను గురించి పాఠశాల విద్యార్థులకు వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో స్థానిక శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గతంలో పోస్టల్ సేవలకు ఎంతో ప్రాముఖ్యత ఉండేదని, నేడు సమాచార రంగంలో విప్లవాత్మక మార్పులు రావడంతో పోస్టల్ సేవలు అంతరించి పోయ్యాయన్నారు. మారుతున్న కాలనుగుణంగా పోస్టల్ సేవల ద్వారా అందించే సమాచారం రంగంపై మార్పులు తీసుకొచ్చి పోస్టల్ సేవల రంగానికి మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలని ఆయన ఆశాబావం వ్యక్తం చేశారు. పోస్టల్ అధికారి ,పాఠశాల డైరెక్టర్ నాగార్జున యాదవ్, పాఠశాల అద్యాపక బృందం సురేంధరరెడ్డి, రవితేజ, ఉదయ్, లక్ష్మన్న, వెంకటరమణ, రవి, ప్రకాష్, భారతి పాల్గొన్నారు.

# జీఎస్టీ ప్రయోజనాలపై అవగాహన



**గూడూరు,అక్టోబర్ 9, ప్రభాతవార్త :** స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం కల్పించిన జీఎస్టీ ప్రయోజనాలపై డాక్టర్లు రోగులకు అవగాహన కల్పించారు. గురువారం జీఎస్టీ రోగులకు అందించే సేవల గురించి గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అధికారి డాక్టర్ ప్రత్యూష ప్రత్యేక సమావేశంను ఏర్పాటు చేశారు. ఆమె ప్రభుత్వం అందించే సేవలు,జీఎస్టీ ద్వారా కలిగే లాభాల గురించి రోగులకు వివరించారు. వైద్య పరంగా మందులు,అలోపతి,ఆయుర్వేద,హోమియో వంటి మందులకు 18 శాతం నుంచి 5 శాతం వరకు తగ్గించిన విషయాలను వివరించారు. అంతే గాక సున్నా శాతంతో జీఎస్టీత పాలసీని తీసుకోవచ్చని, మెడికల్కు సంబంధించిన పరికరాలల్లో కూడా 5 శాతం జీఎస్టీ తో లబ్ధి పొందవచ్చన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. స్థానిక వైద్య సిబ్బంది క్రిష్ణారెడ్డి, బేబీరని, రాజ్యలక్ష్మీ, మనీష, దుర్గ, చిటమ్మలు పాల్గొన్నారు.

# రాష్టస్థాయి పోటీలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ఎంపిక

**నందికొట్కూరు,అక్టోబరు 9,ప్రభాతవార్త:**



ఈ నెల 8వ తేదీన చిన్నటేకూరు గురుకుల కళాశాల నందు జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-19 ఉమ్మడి కర్నూలు జిల్లా కబడ్డీ సెలక్షన్లో నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని ఫిజికల్ డైరెక్టర్ రియాజ్వుద్దీన్ తెలిపారు. గురువారం రాష్టస్థాయి పోటీలకు ఎంపిక అయిన వై.సుధీర్, జి.ఎప్సిబ, విద్యార్థులకు జరిగిన అభినంధన సభలో కళాశాల ప్రిన్సిపాల్ బి.రఘురామాచార్యులు మాట్లాడుతు ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఎన్నిక కాగా అదే విధంగా టి.శివప్రసాద్ విద్యార్థి స్టాండ్బైగా ఎంపిక అయ్యాడని తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా మంచి ప్రతిభ కనపరిచి కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. అధ్యాపకులు చంద్రహాసుడు, జగన్నాధరావు సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# జీఎస్టీపై కేంద్రం తీసుకున్న నిర్ణయం సంచలనాత్మకం

**పత్తికొండ, అక్టోబరు 9, ప్రభాతవార్త:**



జీఎస్టీ తగ్గింపు కేంద్రం తీసుకున్న నిర్ణయం సంచలనాత్మకమైన అంశమని పట్టణంలోని శ్రీరామ హాస్పటల్ ఎండి నీకంత, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ రాములు అన్నారు. గురువారం హాస్పటల్లో జీఎస్టీ సూపర్ సేవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని, రోగులు కొంటున్న మందులపై జీఎస్టీ తగ్గడంతో తక్కువ ధరలకే మందులు కొనవచ్చునని వవారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణులు డా.రాజేష్, అసోసియేషన్ ప్రశిడెంట్ నాగరాజు, సెక్రటరీ రంగశ్రీ, మెడికల్ ఏజెన్సీ కౌలుట్ల, ఎఎన్ఎం అనసూయమ్మ, శ్రీరామ్ హాస్పటల్ సిబ్బంది శకుంతల. వసుందర, అఖిల, మహాదేవి,రాంప్రసాద్, కాశిం, కృష్ణ పాల్గొన్నారు.

# 10వ తేదీ నుండి భోధనేతర పనులు బహిష్కారణ

**ఆలూరు, అక్టోబరు 9, ప్రభాతవార్త :**



మితిమీరిన భోధనేతర కార్యక్రమాల వలన భోధనా సమయం హారించి పోతున్నదని కావున ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10వ తేదీ నుండి భోధనేతర పనులు మరియు విద్యాశక్తి కార్య క్రమాన్ని బహిష్కారిస్తున్నట్లు ఫ్యాప్టో యూనియన్ నాయకులు ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతు ఉపాధ్యాయులకు కూడా మితిమీరిన కార్యక్రమాల వలన భోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా భోధనేతర కార్యక్రమాలు పెరిగి పోయాయని పలు ధఫాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన పట్టించుకోనందున ఈ నెల 7వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ నందు ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగిన పోరుబాట కార్యక్రమంలో భోధనేతర పనులను ఈ నెల 10 నుండి బహిష్కారించాలనికేవలం భోధనకే పరిమితమై మరింత నాణ్యమైన విద్యను విద్యార్థులకు అంధించాలని ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ నిర్ణయం చేసిన విషయాన్ని ఎంఈఓకు వివరించినట్లు నాయకులు తెలిపారు. ఇకపై ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు మధ్యాహ్నా భోజన పథకమునకు సంభంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడుతారని, మూల్యాం కానికి సంభంధించిపరీక్షల నిర్వహణ తప్ప ఏ ఇతర భోధనేతర పనులను గాని అవసరమైన గూగుల్ షీట్స్ నింపడం గాని, విద్యాశక్తి, జీఎస్టీ 2.0 లాంటి సీజినల్ ప్రచార కార్యక్రమాలను గాని చేపట్టబోమని వారు తెలిపారు. ఫ్యాప్టో నాయకులు పాల్గొన్నారు.

# శాశ్వత లోక్ అదాలత్ పై అవగాహన




**కర్నూలు, అక్టోబర్ 09, ప్రభాతవార్త ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి మరియు శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ గురువారం నాడు కర్నూలు న్యాయ సేవా సదన్ నందు యన్ జి ఓ లకు స్టేక్ హోల్డర్స్ కు శాశ్వత లోక్ అదాలత్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్ ప్రజలకు ప్రజలకు అందించే 10 సేవలపై వారికి అవగాహన కలిగించారు. శాశ్వత లోక్ అదాలత్ తో ప్రజలకు జరిగే ఉపయోగాల గురించి వివరించారు. ఈ సంవత్సరం శాశ్వత లోక్ అదాలత్ లో 121 కేసులు ఫైల్ అయితే అందులో 56 కేసులు విజయవంతంగా పరిష్కరించామని తెలిపారు.

# రెగ్యులర్ డాక్టర్ల సమ్మెకు సిఐటియు మద్దతు

**నంద్యాల హాస్పటల్, అక్టోబరు 9, ప్రభాతవార్త :**



గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పిహెచ్సీలలో అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజలకు వైద్య సేవలు అంధిస్తున్న డాక్టర్లు రాష్ట్ర వ్యాప్తంగా 2800 మంది వారం రోజులుగా సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం పిహెచ్సి డాక్టర్లతో చర్చించి వారి సమస్యలను పరిష్కారించాలని సిఐటియు నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు వి.యేసురత్నం, ఏ.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతు మారుమూల ప్రాంతాలలో ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అంధించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని వారి సమ్మె వల్ల పేదలకు ఆరోగ్య సేవలు దూరం అవుతున్నాయని, గతంలో ఇన్ సర్వీస్ డాక్టర్లకు పీజీ సీట్లలో 30శాతం సీట్లు కేటాయించేవారని జీవో నెం. 99ద్వారా దాన్ని ప్రభుత్వం 15 శాతానికి తగ్గించిందన్నారు, వెంటనే 99 జీవోను రద్దు చేసి ఇన్ సర్వీసులో పోష్టు గ్రాడ్యుయేషన్ కోట పునర్దుదరించాలని దీని వలన ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న డాక్టర్లకు అదనపు విద్యార్హతలు పొందడానికి మరియు స్పెషలైజేషన్ కోర్సు చదవడం వలన పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అంధించడానికి ఉపయోగపడుతుందన్నారు. గతంలో మాదిరిగా సీట్లు కేటాయించాలని వారు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తామని, రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ చూపి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు.

# లక్ష్మాపురం సమ్మర్స్టోరేజ్ ట్యాంక్ కాంట్రాక్టర్పై ఎంపి బైరెడ్డి శబరి విమర్శించడం తగదు

**– పగిడ్యాల జెడ్పీటిసి పుల్యాల దివ్య**



**పగిడ్యాల, అక్టోబరు 9, ప్రభాతవార్త :** నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం లక్ష్మాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కాంట్రాక్టర్పై నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి విమర్శలు చేయడం తగదనీ జెడ్పీటిసి పుల్యాల దివ్య అన్నారు. పగిడ్యాలలో మాజీ జెడ్పీటిసి పుల్యాల నాగిరెడ్డి స్వగృహంలో గురువారం మధ్యాహ్నం జెడ్పీటిసి పుల్యాల దివ్య, లక్ష్మాపురం ఉప సర్పంచ్ షాజహాన్ బేగం, వైఎస్ఆర్ మహిళా విభాగము అక్క్యక్షురాలు లత, అంగన్వాడీ విభాగం అధ్యక్షురాలు రమాదేవి, మహిళా రైతు విభాగము అధ్యక్షురాలు లీలావతి, శేషమ్మ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి బుధవారం లక్ష్మాపురం సమ్మర్స్టోరేజ్ ట్యాంక్ను సందర్శించడానికి వచ్చారనీ సంతోషించడం జరిగిందనీ, ప్రజల సమస్యలను పరిష్కరిస్తుందనకున్నామనీ, అయితే సమ్మర్స్టోరేజ్ ట్యాంక్ సమస్య గురించి కాకుండా కాంట్రాక్టర్పై వ్యక్తి గతంగా దూషించడం సభ్యత కాదనీ, ఎంపి తాగునీటి సమస్యను పరిష్కారానికి కాకుండా వ్యక్తిగత విమర్శలు చేసినట్లు అనిపిస్తుందన్నారు. ప్రధాన సమస్య పిల్లర్బెడ్లలో ఇసుకమార్పిడి చేయడం కాంట్రాక్టర్ పనికాదన్నారు. ఎంపి నిధులతోగాని లేక ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించి అక్కడ నెలకొన్న సమస్యను పరిష్కరించరించేందుకు కృషిచేయాలనీ కోరుతున్నాము తప్ప నిరాదారమైన వ్యక్తిగత అసత్యఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. పగిడ్యాల, నందికొట్కూరు మండలాలకు ప్రాణదారమైన నాగటూరు ఎత్తిపోతల పథకం మరమ్మత్తులకు నోచుకోక సంవత్సరం కావస్తున్నా పట్టించుకొనే నాథుడులేదు, కావున ఎంపి దృష్టిసారించి రైతాంగాని ఆదుకోవా లన్నారు. నందికొట్కూరు నండి పగిడ్యాలకు వెళ్లేదారి రహదారి గుంతలమయం కావడంతో నిత్య ప్రమాదాలకు నిలయంగా మారినందున రహదారి నిర్మాణం చేపట్టాలనీ కోరుతున్నాము. లక్ష్మాపురం సమ్మర్స్టోరేజ్ ట్యాంక్కు 2023 నుండినేటి వరకు చేసిన పనులకు బిల్లులు రాక అవస్థలు పడుతుంటే, ఆలాంటి కా ంట్రాక్టర్ను బిల్లులు చేసుకున్నారనడం అసత్యమని జెడ్పీటిసి పుల్యాల దివ్య అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాపురం గ్రామానిచెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

# సూపర్ జీఎస్టీ సూపర్ సేవ్ కార్యక్రమం నిర్వహించిన సిబ్బంది

**పత్తికొండ, అక్టోబరు 9, ప్రభాతవార్త :**



స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్య క్రమానికి హాజరయిన జనసేన ఇన్చార్జ్ రాజశేఖర్ హాజరై జీఎస్టీ తగ్గింపు వలన జరిగే ప్రయోజనాలను మరియు నిత్యావసరాలకు, బిల్డింగ్ అవసరమైన పరికరాలు మరి ముఖ్యంగా హాస్పటల్ ఖర్చులు పరీక్షలకు మందులకు భారీగా తగ్గింపు వర్థింప జేసినందుకు ప్రధాని మోడీకి, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్కు కృతజ్ఞతలు తెలిపారు. ఎఎన్ఎం,లు, సూపర్ వైజర్లు సాయిబాబా,వెంకటేశ్వర్లు, ప్రకాష్ వరలక్ష్మి, గంగరత్నమ్మ, ఎంఎల్హెచ్పిలు పాల్గొన్నారు.

# సిఐ వికృత చేష్టలు అదనపు యస్పికి వివరించిన జర్నలిస్టులు

**నందాల, అక్టోబరు 9, ప్రభాతవార్త ప్రతినిధి :**



నంద్యాల జిల్లాలో నిర్భయంగా వార్తలు వ్రాసే జర్నలిస్టులపై నమోదు అయిన అక్రమ కేసులుఎత్తి వేయాలని జర్నలిస్టుల స్వేచ్ఛను కాపాడలని ఇక్కడునక్న సిఐ వికృత చేష్టలగురించి ఎపియస్పి యుంగదర్బాబుకు నంద్యాల జర్నలిస్టుల జేఏసి గురువారముస్థానిక ఎయస్పి యుగందర్ బాబుకు వినతి పత్రము అదించారు. ఓ ఒంటరి మహిళ అవేదనను ప్రచురిస్తే తప్పుడు కేసులు బనాయించి మీడియాకు సంకేళ్లు వేయాలని చూడడము సరికాదని జర్నలిస్టులు కోరారు, వార్తలు ప్రచురించిన వారిపైన కేసులు పుడుతూ బెదిరింపులకు పాల్పడి తన తప్పును కప్పి పుచ్చుకోవడానికి యత్నిపస్తున్నప సిఐ కంబగిరిరాముడు గతంలో అనేక సార్లు సస్పెండు అయినా అయన తీరు మారలేదని ఎయస్పికి వివరించారు.ఇంకా మహిళతో తన వివాహేతర సంబందము బయటకు వస్తే ఉద్యోగ బాద్యతపై ఇబ్బందులు వస్తాయని కులాల మద్య చిచ్చు పెట్టడము బాదాకరము అన్నారు. రానునక్న కాలంలో నంద్యాలలో కుల మతాలకు మద్య చిచ్చు పేట్టెవిదముగా దర్నాలు చేయించడము సోషల్ మీడియా లో పోస్టులు పెట్టిస్తూ తన మెడకు తానే కత్తిచుట్టుకున్న చందంగా ఉందన్నారు. ఇలాగే ఖాకీలు కరెక్టు గా ఉంటే స్టేషన్కు మహిళలను రావాలిన వాట్సప్లో మహిళతో చాటింగ్ చేస్తూ అడ్డంగా దొరికిపోయి ఇలా వాస్తవాలను తప్పు దారి పట్టించేందుకు క్యాస్ట్ కార్డు వాడుకోవడము శోచనీయంగౌరవప్రదమైన వృత్తిలో ఉంటూ వృత్తికే కళంకంగా తెచ్చేలా ప్రవర్ధించడము పట్ల సోషియల్ మీడియాలో అయన తీరు పట్ల వ్యతిరేకత పెద్దఎత్తున అరోపనలు చేస్తున్నారు. అంతే కాకుంద జిల్లాలోనిఅత్మకూరు శ్రీశైలం తదితర ప్రాంతాల్లో జర్నలిస్టులు అంతా సంఘితముగా అదికారులకు వినతి పత్రాలు అందచేసి సాటి జర్నలిస్టులకు అండగా నిలువడము శోచనీయమన్నారు. రానున్న రోజుల్లో అసత్య ప్రచారాలు చేయిస్తున్న పోలీసు ఉద్యోగి అయిన కంబగిరిరాఎముదుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎల్రక్టానిక్, ప్రంటు మీడియా సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బందికి సమయపాలన తప్పనిసరి

**రుద్రవరం, అక్టోబర్ 9, ప్రభాతవార్త:**



సచివాలయ సిబ్బందికి సమయపాలన తప్పనిసరి అని తహశీల్దార్ దోని అల్ఫ్రెడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని 1వ సచివాలయాన్ని తహశీల్దార్ తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాటా ్లడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తు అవసరాల నిమిత్తం వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను త్వరితగిన పరిష్కరించాలని ఆయన తెలిపారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈయన వెంట వీఆర్వో సంజీవరెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

**BEFORE DEBTS RECOVERY TRIUBUNAL-II**
Triveni Complex at Hyderabad

**OA.No.762 / 2025**

**Between:**
**Bank of Baroda,** Adoni Branch, Kurnool District
Rep by its Senior Manager ...APPLICANT
**And**
**M/s.Maya Ladies Corner & Another ...DEFENDANTS**

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

To,
**M/s. Maya Ladies Corner, Prop: Mr.Anup Kumar Jayanthilal Shah,**
D.No.15-138, L.B.Street, Jain Temple Road, Adoni, Kurnool District, AP-518301
**Mrs.Latha Anup Kumar Shah, W/o. Anup Kumar Jayanthilal Shah,**
aged 41 yrs, Female, D.No.15-138, L.B.Street, Jain Temple Road, Adoni, Kurnool District, AP-518301 **...DEFENDANTS**

Please take the summons in the above O.A.No.762/2025 filed by the applicant for recovery of money of **Rs.22,27,516/-** against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **"VAARTHA"** daily newspaper and posted the matter to 17/11/2025.

In accordance with sub-section (4) of section 19 of the Act, the defendants are directed as under;

(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;

(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;

(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;

(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;

(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are directed to appear before Debts Recovery Tribunal - II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001 in person or through an Advocate and file written statement on **17/11/2025 at 10.30 a.m.** and show cause as to why the relief prayed for should not be granted.

Take Notice that in case of default the Application will be heard and determined in your absence.

**Given under my hand and seal of this Tribunal on this day 07th October, 2025.**

(By order of the DRT II, Hyderabad)

**Signature of the Officer Authorized to issue summons**

# ప్రధాని పర్యటతోనైనా .. రోడ్డు వెడల్పుకు మోక్షం కలిగేనా...!

**- సీమ పాలకులు..స్పందించాలని ప్రజల వినతి**
**- ప్రాణాంతకంగా మారిన కోడుమూరు - కర్నూలు రహదారి**

**కోడుమూరు,అక్టోబర్ 9, ప్రభాతవార్త :** జీఎస్టీ విజయోత్సవంపై ఈ నెల 16వ తేదిన కర్నూలులో భారత ప్రధాని నరేంద్రమోడీ పర్యటనతోనైనా .. నిత్యం రక్తమోడుతున్న రహదారికి మోక్షం కలిగేనా .. అని కోడుమూరు నియోజకవర్గ ప్రజలు కూటమి ప్రభుత్వ పాలకుల విష్మయతను వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగున్నర దశాబ్దకాలం కింద ఆనాటి భారత దేశ కాంగ్రెస్ రథ సారధి దివంగత భారత ప్రధాని ఇందిరాగాంధీ ఈ ప్రాంతంలో పర్యటించిన విషయం విదితమే. ఆ తరువాత మళ్లీ కర్నూలు ప్రాంతానికి నరేంద్ర మోడీ రానున్నడంతో కర్నూలు జిల్లాలో నెలకొన్న సమస్యల వినతుల మాలను సమర్పించే అవకాశాలున్నాయి. ఆ కోవా కిందే ఎంతో కాలం నుంచి ఎదరు చూస్తున్న రాయలసీమకు ముఖ ద్వారమైనా.. కరూ ్నలు నుంచి కోడుమూరు మీదుగా వెళ్లే రహదారికి ఫోర్ లైన్ కల్పించే అవకాశంకు మోక్షం కల్గించాలని ఈ ప్రాంత వాసులు,తరుచూ జరిగే రోడ్డు ప్రమాద బాధిత కుటంబాలు ఘోసిస్తున్నాయి. కేంద్రంలో మూడు పర్యాయాల పాటు ఏకతాటిపై బిజెపి పాలన సాగిస్తున్న భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రాకతోనైనా.. ఇక్కడ అభి వృద్ధికి నోచుకోని రహదారికి మహర్దశ కల్పించాలని స్థానికులు జిల్లాలోని కూటమి పార్టీలకు చెందిన మంత్రులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. రాష్ట్రంలో అన్ని చోట్ల గ్రామీణ రహదారులకు దశ దిశలు మారుతున్నాయి .. కానీ కోడుమూరు రహదారికి మాత్రంలో




ఏళ్ల తరపడిగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన రోడ్డు వెడల్పుకు నోచుకోవడం లేదనే చెప్పుకోవాలి. దీంతో ఈ మార్గం ప్రాణాంతక రోడ్డుగా మారడం గమనార్హం. ఈ మార్గం గుండా కర్నూలు పార్లమెంట్‌లోని7 అసెంబ్లీల ప్రజాప్రతినిధు లతో పాటు, నాలుగు రాష్ట్రాలకు వెళ్లేందుకు ఈ రహదారే ఎంతో కీలకం. అలాంటి రోడ్డు మార్గంకు ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న నాలుగు లైన్ల రోడ్డు సౌకర్యంకు గ్రహణం పట్టిన దానిలా ఉండి పోవడం శోచనీయం. గత ఐదేళ్లకు ఒక సారి ప్రభుత్వాలు మారుతున్నా.. పాల కులు మారుతున్నా.. ఈ రహదారి మార్గాన్ని వెడల్పు చేయలేక పోయారనేది కొసమెరుపు.ఈ విధంగా కావడానికి సీమలో ఉన్న పాలకుల నిర్లక్ష్యవైఖరి మూలంగానే రోడ్డు వెడల్పుకు నోచుకోవడం లేదన్న విమర్శలు కూడా గుప్పు మంటున్నాయి. ఏది ఎమైనా రోడ్డు ప్రమాదాల జోన్‌గా మారిన కోడుమూరు నుంచి కర్నూలు వెళ్లే రహదారికి ఫోర్ లైన్ మార్గానికి రూపుదిద్దుకోవడానికి నేడు ఇక్కడకు రానున్న భారత ప్రధాని నరేంద్రమోడీ రాకతో ఆ కళను సాకారం చేసుకోవాల్సి న భాద్యత కూటమి పాలకులకు కలగలాని స్థానికులు కోరుతున్నారు.

# ప్రధాని పర్యటన నేపథ్యంలో.. ఎంపీ నాగరాజు తో భేటీ



**కర్నూలు అక్టోబర్ 09 ప్రభాతవార్త ప్రతినిధి :** కర్నూలులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తో టీడీపీ రాయలసీమ జోన్ 5 ఇంచార్జి, ఎం.ఎల్.సీ బీద రవిచంద్ర యాదవ్ భేటీ అయ్యారు.. నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ నాగరాజు తో సమావేశామైన ఆయన ఈ నెల 16 న ఓర్వకల్ మండలం నన్నూరు టోల్ ప్లాజా వద్ద జరిగే మోదీ బహిరంగ సభకు సంబంధించి జన సమీకరణ తో పాటు ఏర్పాట్ల పై చర్చించారు.. సమావేశం అనంతరం మొదటి సారి తన కార్యాలయానికి వచ్చిన ఎం.ఎల్.సీ బీద రవిచంద్ర కు ఎంపీ శాలువాతో సత్కరించి, వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేశారు...ఈ కార్యక్రమంలో డి.సి.ఎం.ఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్లు రామకృష్ణ, వెంకటరాముడు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు తో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు...

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ. ఎమ్మెల్యే పార్థసారధి



**ఆదోని అక్టోబర్ 09 ప్రభాతవార్త :**
ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ప్రజలకు వరం లాంటిది కాబట్టి అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదోని శాసనసభ్యులు డాక్టర్ పివి పార్థసారధి అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి సంబంధించిన 30 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన 1776921 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలందరూ తమ ఆరోగ్యం బాగోలేక హాస్పిటల్ లో ఎంత డబ్బులు ఖర్చు పెట్టి నటువంటివారు ఆ బిల్లులను జాగ్రత్త వహించి నేరుగా నాకు ఇస్తే వాటిని సీఎం కార్యాలయానికి పంపించి ఖర్చుపెట్టిన డబ్బులు 40 నుంచి 60 వరకు వచ్చే విధంగా చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర , మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ విజయ్ కృష్ణ , డైరెక్టర్లు రత్న బాయ్ ,రామకృష్ణ , శ్రీనివాస్ ఆచారి, పట్టణ అధ్యక్షులు తోవి నాగార్జున, యువ మోర్చా మండల అధ్యక్షులు రవిశంకర్, నరసింహ, మండల కార్యదర్శిలు బాలముని శేఖర్, కోసిగయ్య తదితరులు పాల్గొన్నారు

# జీఎస్టీ తగ్గింపు వివరాలు ప్రతిఒక్కరు తెలుసుకోవాలి



**కర్నూలు విద్య, అక్టోబర్ 9, ప్రభాతవార్తః**
జీఎస్టీ తగ్గింపు వివరాలు ప్రతిఒక్కరు తెలుసుకోవడం ద్వారా కొనుగోలు రేటు వ్యత్యాసం మనకు కలిసి వస్తుందని క్లస ్టర్‌యూనివర్శిటి ఎగ్జామినేషన్ డా.నాగరాజు శెట్టి పేర్కొన్నారు. బుధవారం క ్లస్టర్‌యూనిర్శిటిలో జీఎస్టీ తగ్గింపుపై నాల్గవరోజు అవగాహన కార్యక్రమాల సందర ్భంగా డా.నాగరాజుశెట్టి మాట్లాడుతూ క్లస్టర్ యూనివరి ్శటి విద్యార్థులు జీఎస్టీ తగ్గింపు వివరాలు పూర్తిగా తెలుసుకొని ఏవరి పరిధిలో వారు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ అక్తర్ బాను మాట్లాడుతూ విద్యార్థులు చైతన్యవంతులైతే జీఎస్టీ తగ్గింపు వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కష్టమేమికాదన్నారు. యూనివర్శిటి స్థాయిలో పోస్టర్ ప్రజెంటేషన్,పెయింగ్ పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. డీన్ అడ్మిన్‌షన్స్ వాహిజ్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుపై ఎంత అవగాహన కల్పిస్తే అంత ఉపయోగయోగం ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో క్లస్టర్‌యూనివర్శిటి అధ్యాపకులు డా.దలవాయి శ్రీనివాసులు, డాక్టర్ లక్ష్మణ్‌గుప్తా, డాక్టర్ మల్లయ్య, పి కీర్తికుమారి, డా.అనుషా, డా.స్వప్నశ్రీ, డా.దివాకర్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జాయింట్ కలెక్టర్ల బదిలీలు

**: కర్నూలు జేసీగా నూరుల్ ఖమర్.. నంద్యాల జేసీగా కార్తీక్**

**కర్నూలు, అక్టోబర్ 9, ప్రభాతవార్త :**
ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇద్దరు జాయింట్ కలెక్టర్లు బదిలీ అయ్యారు. ఆ స్థానాల్లో కొత్తవారిని ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర ఫైనాన్స్ విభాగంలో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్న నూరుల్ ఖమర్ ను కర్నూలు జాయింట్ కలెక్టర్ గా నియమించారు. కర్నూల్ లో ఉన్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య ను రాష్ట్ర గిడ్డంగుల శాఖ వైస్ చైర్మన్ గా బదిలీ చేశారు. జీఏడి లో ఉన్న కొల్లాబత్తుల కార్తీక్ ను నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ గా బదిలీ చేశారు. నంద్యాలలో జాయింట్ కలెక్టర్ గా పని చేస్తున్న విష్ణు చరణ్ ను రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ విభాగం డిప్యూటీ డైరెక్టర్గా బదిలీ చేశారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల బహుళ ప్రయోజనాలు



**నంద్యాల, అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి**
మా ప్రభుత్వం స్మార్టు రేషన్ కార్డులు అందిస్తున్నదని దీని వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని రాష్ట్ర న్యాయ ముస్లీంమైనార్టి సంక్షేమ శాఖ మంత్రి యన్‌యండి ఫరూక్ అన్నారు. గురువారబు జిల్లా కేంద్రములోని నంద్యాలోని 4వార్డులో రేషన్ కార్డులకు సంబందించిన స్మార్టు కార్డులను మంత్రి పంపిణీ చేశారు ఈసందర్భముగా అయన మాట్లాడుతూ స్మార్టు రేషన్ కార్డుల వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు.

## సిహెచ్‌సిలో జీఎస్టీపై అవగాహన



**వెల్దుర్తి, అక్టోబర్9,ప్రభాతవార్త**
స్థానిక సిహెచ్‌సిలో గురువారం వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్.బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జీఎస్టీపై రోగులకు వైద్యులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా హోమియోపతి వైద్యురాలు డాక్టర్.భారతీదేవి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో వైద్యసంబంధ మైన వస్తువులకు,నిత్యావసరవస్తువుల ధరలు ఏ విధంగా తగ్గాయో వివరించారు.జీఎస్టీ తగ్గింపుతో అందరికి అందుబాటులో ధరలు ఉన్నాయన్నారు.అదేవిధంగా రత్నాపల్లి గ్రామసచివాలయంలో గ్రామనాయకులతో కలిసి అధికారులు జీఎస్టీపై అవగాహన కల్పంచారు.ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి వైద్యులు డాక్టర్.బాల చంద్రారెడ్డి,డాక్టర్.భారతీదేవి,డాక్టర్.రాజశేఖర్,డాక్టర్.సాహిత్య,డాక్టర్ .వరప్రసాద్,డాక్టర్.భాను మంజీర,వైద్యసిబ్బంది,రత్నాపల్లి గ్రామనాయకులు క్రిష్టారెడ్డి,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీమఠంలో సువర్ణ పల్లకి సేవ



**- సువర్ణ పల్లకిలో మృత్తికా బృందావనం ఊరేగింపు**

**మంత్రాలయం, అక్టోబరు09, ప్రభాతవార్త;** పవిత్ర తుంగభద్ర నది తీరాన వెలిసిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందా వనం అర్చకులు జయతీర్థ, కపీల్‌స్వామి, సహాయ పీఆర్‌ఓ హొన్నల్లి వ్యాసరాజ్ ఆచార్ ఆధ్వర్యంలో మృత్తికా బృందావనాన్ని సువర్ణ (బంగారు) పల్లకిలో ఉంచి అశేష జనవాహిని నడుమ, భాజా భజంత్రీల నడుమ, మంగళ వాయిధ్యాల నడుమ, నమో రాఘవేంద్ర నామస్మరణతో శ్రీ మఠం ప్రాంగణంలో ఘనంగా ఊరేగించారు. ప్రవచన మండపంలో బంగారు పల్లకిసేవ చేయించిన భక్తుల పేరు, గోత్రనామాలపైసంకల్ప పూజలు నిర్వహించారు. సేవ చేయించిన భక్తుల పేరు, గోత్ర నామాలపై సంకల్ప పూజలు నిర్వహించారు. సేవ చేయించిన భక్తులకు విశేష దర్శనభాగ్యం కల్పించారు. ఈరికి శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థ స్వామిజీ వారు శేష వస్త్రం, పుష్ప, ఫల, మంత్రాక్షింతలుఇచ్చి ఆశీర్వదిం చారు. ఈ కార్యక్రమంలో శ్రీ మఠం దివాన్, కుర్డి జయతీర్థ, అనంత, గురు, రమేష్,సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహానందిలో ప్రముఖుల పూజలు



**మహానంది, అక్టోబర్ 9, ప్రభాతవార్తః**
మహానందీశ్వరుని సన్నిధిలో విడివిడిగా ప్రముఖులు పూజలు నిర్వహించారు. గురువారం స్వామివార్ల దర్శనార్థమై వచ్చిన ఐపిఎస్ దంపతులు శివశంకర్‌రెడ్డి, మనీషారెడ్డిలు, నంద్యాల విజయ డైయిరీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రదిప్‌కుమార్ దంపతులు కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అనవాయితీ ప్రకారం వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర్‌శర్మ, హనుమంతు శర్మల వేదమంత్రోత్స రణల మధ్య సూపరింటెండెంట్ శశిధరరెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్యలు కండువా కప్పి స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు.

# కర్ణాటక మద్యం సరఫరాపై.. ఉక్కుపాదం మోపుతాం..!

**- 12 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం**
**- ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్**



**ఆదోనిటౌన్, అక్టోబరు09, ప్రభాతవార్త;**
కర్ణాటక మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపుతామని ఆదోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ అన్నారు. గురువారం ఆదోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కౌతాళం మండలం బుదుములదొడ్డి క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా 12 బాక్సుల కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన కౌతాళం ముకయ్య, చిరుతపల్లి గ్రామానికి చెందిన తలారి వీరేష్‌లు మోటార్ సైకిల్‌పై అక్రమంగా 12 బాక్సుల కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. 90 ఎం.ఎల్. పరిమాణం గల 1152 కర్ణాటక మద్యం ప్యాకెట్లు సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసి, జైలుకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలించినా, అమ్మినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్మశానానికి వెళ్లేదారి కరువు

**- వరిమడిలో శవాన్ని మోసుకెళ్తున్న కుటుంబ సభ్యులు**

**రుద్రవరం, అక్టోబర్ 9, ప్రభాతవార్త:**
మనిషి బ్రతికి ఉన్నంతకాలం ఎంత పేరు ప్రఖ్యాతులు, సిరి సంపదలు సంపాదించినా చనిపోయిన తరువాత కలిసిపోయేది మట్టిలోనే. చనిపోయాక కాడిని కాటికి మోసేందుకు నలుగురు వ్యక్తులు పాతిపెట్టెందుకు 6 అడుగుల స్థలం ఉడాలని పూర్వం పెద్దలు అలోచించి తనకు, తన వారసులకు బంధువులకు స్మశాన స్థలాన్ని ముందే ఏర్పాటు చేసుకునేవారని మనకు చరిత్ర చెబుతుంది. ప్రస్తుత రోజుల్లో మనుష్యులకు ఈ అంశాలు కష్టంగానే మారాయి. అందులో ముఖ్యంగా చనిపోయిన వారిని పూడ్చిపెట్టెందుకు స్మశాన స్థలాలు ఉన్నా ఇప్పుడు ఆ స్థలం కొందరు భూ అక్రమణదారులు స్మశాన స్థలాలను అక్రమించుకొని పంట పొలాలు వేసుకోవడంతో శవాలను, చనిపోయిన వ్యక్తిని పూడ్చివేసేందుకు అనేక అవస్థలు పడాల్సిన దుస్థితి గురువారం మండలంలోని అప్పనపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. స్మశాన స్థలానికి శవాన్ని పూడ్చిపెట్టెందుకు వెళ్లాలంటే స్మశాన స్థలానికి దారిలేక దారి ఉన్న ఆ దారిని అక్రమించుకొని వరినాట్లు వేయడంతో శవాన్ని మోసుకెళ్లాలంటే వరిమడిలో నడుచుకుంటూ కిందమీద నానా అవస్థలు కాటికి చేరాల్సిన దుస్థితి నెలకొంది. ఇలాగే మండలంలోని పలు గ్రామాల్లో స్మశాన స్థలాలకు దారులు లేక స్మశాన స్థలాలు లేక చాల అవస్థలు దుస్థితి నెలకొందని పలు గ్రామాల్లో ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్మశాన స్థలాలు, వాటికి దారులు ఏర్పాటు చేయాలని అయా గ్రామాల ప్రజలు కోరుతున్నామన్నారు.



## తగ్గిన కొలనుభారతి హుండి ఆదాయం



**కొత్తపల్లె, అక్టోబర్ 9, ప్రభాతవార్తః**
కొలనుభారతి హుండి ఆదాయం తగ్గింది. మే 26 నుంచి సెప్టెంబర్ 9 వరకు నాలుగు నెలల వ్యవధిలో భక్తులు హుండిలో అమ్మవారికి సమర్పించిన కానుకలను బుధవారం దేవాదాయశాఖ ఆలయ కమిటీ సమక్షంలో లెక్కించారు. కేవలం రూ.1,44,115లు మాత్రమే ఆదాయం వచ్చింది. గతంలో రూ.2 లక్షలకు పైగా వచే ్చది. ఒకేసారి రూ.50 వేల మేర తగ్గడంతో జిల్లా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి, ఆలయ అర్చకుల పనితీరుపై అగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే భక్తుల నుంచి సంభావన పేరుతో అర్చకులు డబ్బులు వసూలు చేయడంతో అమ్మవారి ఆదాయం తగ్గిందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రవర్తన మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సుండిపెంటలో అటవీశాఖ అధికారుల.. ఆకస్మిక తనిఖీలు

**శ్రీశైలం సెప్టెంబర్ 09 ప్రభాతవార్త:**
శ్రీశైలం మండలం సుండిపెంట గ్రామంలో అటవీశాఖ అధికారుల ఆకస్మిక తనీకీలు చేపట్టారు పాత సుండిపెంటలోని ఓ గృహంలో చిరుతపులికి చెందిన ఒక గోరు,అడవి జంతువైన కణితికి చెందిన కొమ్మును అటవిశాఖ అధికారులు స్వాదీనం చేసుకున్నారు ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాలతో పక్కా సమాచారంతో శ్రీశైలం రేంజ్ సబ్ డిఎఫ్ఓ భబిత,శ్రీశైలం రెంజర్ పరమేశ్వరులు చాకచక్యంగా పథకం ప్రకారం పాత సుండిపెంటలోని చెన్నారెడ్డి అనే వ్యక్తి గృహంలో అటవీశాఖ సిబ్బందితో ముమ్మరంగా తనిఖీ నిర్వహించి కణితి, సొమ్ము, చిరుతపులి గోరు స్వాధీనం చేసుకున్నట్లు సబ్ డిఎఫ్ఓ భబిత,రెంజర్ పరమేశ్వరులు మీడియాకు వెల్లడించారు అయితే అటవిశాఖ సిబ్బంది రైడ్ చేసిన సమయంలో నిందితుడు చెన్నారెడ్డి అతని గృహంలో లేకపోవడంతో అతనికి నోటీసులు ఇచ్చామని రేంజర్ పరమేశ్వరులు




తెలిపారు నిందితుడు చెన్నారెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని త్వరలోనే చెన్నారెడ్డిని అదుపులో తీసుకుని పూర్తి వివరాలు వెల్లడిస్తామని అన్నారు అటవి హక్కులను కాలరాస్తే ఎంతటివారైనా ఊపేక్షించేది లేదని అటవిశాఖ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు....

## జిల్లా ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

**నందికొట్కూరు,అక్టోబరు 9, ప్రభాతవార్త:**
ఇటీవలే నంద్యాల జిల్లా ఎస్పీగా పదవి భాధ్యతలు చేపట్టిన సునీల్ షెరాన్ నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. నియోజకవర్గం సమస్యలపై చర్చించినట్లు తెలిసింది.



## లీగల్ అడ్వైజర్ మృతి నివాళీలు అర్పించిన ఎమ్మెల్యే



**ఆలూరు,అక్టోబరు 9, ప్రభాతవార్త:**
ఆలూరు నియోజకవర్గం లీగల్ అడ్వైజర్ మెంబర్ వీరేష్‌బాబు ఆనారోగ్యంతో చికిత్స పొందుతు గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి హొత్తిబెళగల్ గ్రామంలో వీరేష్ పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళీలు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.